క్లుప్తంగా

'స్పందన'కు 12 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో శ్రీనివాస్‌కు బంగారు పతకం


బాక్సింగ్ పోటీలో గెలుపొందిన మెలిపాక శ్రీనివాస్

సీతంపేట: ఈ నెల 11 నుంచి 18 వరకు బెంగళూరులో జరిగిన ఖేలో ఇండియా సౌత్ ఓపెన్ టాలెంట్ హంట్ బాక్సింగ్ పోటీలలో అక్కయ్యపాలేనికి చెందిన మెలిపాక శ్రీనివాస్ బంగారు పతకం సాధించాడు. 63.5 నుంచి 67 కిలోల విభాగంలో ఢిల్లీకి చెందిన భూపేష్‌తో తలపడి శ్రీనివాస్ బంగారు పతకం గెలుపొందాడు. ఈ పోటీల్లో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా ఏపీకి ఒకే ఒక గోల్డ్ మెడల్ రాగా, అది విశాఖకు చెందిన శ్రీనివాస్ సాధించడం విశేషం. వైఎస్సార్ సీపీ జోనల్ మహిళా విభాగం ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి బంగారు పతక విజేత శ్రీనివాస్‌ను అభినందించారు.

లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ల మంజూరు


లబ్ధిదారులకు గ్యాస్ స్టౌ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: ప్రధాని మోదీ ఉజ్వల 2.0 పథకం కింద మంజూరైన గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదా రులకు మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అందజేశారు. సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో 70 మంది లబ్ధిదారులకు గ్యాస్ స్టవ్, రెగ్యులేటర్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం కన్వీనర్ సురేష్‌బాబు, రాంబాబు, రమణ, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-1లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మరణించినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. మృతుని వయసు సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వుంటుందని, ఎవరైనా గుర్తిస్తే విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా, లేదా 9440627547/9866413487లో తెలియజేయాలని కోరారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు(డీఎస్ఆర్పీ), బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు సిబ్బందితో కలసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. సుభాన్(25) అనే వ్యక్తి బ్యాగులో సుమారు 3 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ గంజాయిని విశాఖ మీదుగా కేరళకు తీసుకువెళ్తున్నట్లు విచారణలో తెలిపాడని, నిందితుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.

మార్గం.. సువిశాలం


రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్

- రూ.11 కోట్లతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు విస్తరణ
- రూ.96 లక్షలతో మహారాణి పార్లర్ కూడలి బ్యూటిఫికేషన్
- ట్రాఫిక్ సమస్యలు, ఆక్రమణలకు చెక్
- రహదారి విస్తరణతో మేలు చేకూరుతుందని స్థానికుల హర్షం



80 అడుగుల విస్తరణతో విశాలంగా కనిపిస్తున్న అక్కయ్యపాలెం మెయిన్ రోడ్

సీతంపేట: దశాబ్దాలుగా ఇరుకు మార్గంతో పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు రహదారి విస్తరణతో తొలగాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో ఒకటైన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ఆక్రమణల గుర్రై ఇరుగ్గా మారడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. మాస్టర్ ప్లాన్‌లో 100 అడుగుల రహదారి అయినప్పటికీ పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణకు నోచుకోలేదు. ఈ విషయంలో దశాబ్దాల కాలంగా గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపించాయి. పెరిగిన వాహనాల రద్దీ, ట్రాఫిక్ సమస్యలు అధిగమించేలా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారుల్లో ప్రయాణం సాఫీగా జరిగేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విస్తరణ పనులు చేపట్టింది. ఇందు కోసం ప్రభుత్వం రూ.11 కోట్లు నిధులు మంజూరు చేసింది. మహారాణి పార్లర్ కూడలి బ్యూటిఫికేషన్ కోసం రూ.96 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో హైవే నుంచి మహారాణి పార్లర్ వరకు 80 అడుగుల రోడ్డుగా.. అక్కడి నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగుల రోడ్డుగా విస్తరిస్తున్నారు. సుమారు రెండు నెలలుగా ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

తొలి దశ విస్తరణ పూర్తి..

రహదారి విస్తరణలో తొలి దశ పనులు దాదాపు పూర్తయ్యాయి. తొలి దశలో అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ నుంచి హైవే వరకు ఉన్న రహదారిని 80 అడుగులుగా విస్తరించారు. ఈ మార్గంలో రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి. సీడబ్ల్యూ డ్రెయిన్లు, దానిపై పాదచారులు నడవడానికి వీలుగా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. రోడ్ మధ్యలో సెంటర్ మీడియన్ నిర్మించారు. దానిపై విద్యుత్ దీప స్తంభాలు ఏర్పాటుకు విద్యుత్ లైన్లు


అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో నిర్మించిన సెంటర్ మీడియన్

వేస్తున్నారు. దీంతో అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ పనులు దాదాపు సగం పూర్తయినట్టే.

జోరుగా పనులు..

మహారాణి పార్లర్ నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగుల రోడ్ విస్తరణ పనులు కూడా జోరుగా జరుగుతున్నాయి. రోడ్ విస్తరణలో కొన్నిచోట్ల టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. వీటిపై జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ ఇటీవల క్షేత్ర స్థాయిలో పర్యటించి అధికారులకు సూచనలిచ్చారు. రోడ్ విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయని స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు తీరినట్టే



హైవే నుంచి దొండపర్తి వెళ్లడానికి ట్రాఫిక్ సమస్యలతో చాలా ఇబ్బంది పడేవారం. సింగిల్ రోడ్ కావడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలతో తరచూ ట్రాఫిక్ జామ్ అయ్యేది. సాయంత్రం వేళల్లో మరింత జటిలంగా ఉండేది. ఈ సమస్యలన్నీ తీరేలా అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డును విస్తరణ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తీరుతాయి.

– తామరాపు సంతోష్, అక్కయ్యపాలెం

పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు



అసలే ఇరుకు రహదారి. ఆపై తోపుడు బళ్లు, చిరువ్యాపారాలు, వాహనాల రద్దీతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో ప్రయాణించడం చాలా కష్టంగా ఉండేది. ట్రాఫిక్‌లో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు నడవడానికి భయపడే వారు. రహదారి విస్తరణలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. పాదచారులకు సౌకర్యంగా ఉంటుంది.

– శీల వెంకటరమణ, లలితానగర్

నూతన సామాజిక భవనం ప్రారంభం


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్‌లో రూ.19.80 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని సోమవారం రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజలకు సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మౌలిక వసతులు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ శశికళ, డీఈ భరణికుమార్, ఎడ్ల సిద్ధార్థ, బొడ్డేటి గంగా మహేష్, కాయిత రత్నాకర్, డి.శ్రీను, నాయకులు సొండి సురేష్, శివప్రసాద్, మహేశ్వరరెడ్డి, కరుణ, నాగలక్ష్మి, లక్ష్మి, అనురాధ, గౌస్, శ్రీనివాసరావు, జోన్-5 అధికారులు, క్రాంతి యువజన ప్రగతి మండలి సభ్యులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలలితాపీఠం వార్షికోత్సవాలు


'మన మహర్షులు' పుస్తకం ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట : శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో 'అమృతోత్సవం' పేరిట ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న వేడుకలు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో మహా సంకల్పంతో ప్రారంభమయ్యాయి. కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, అంకురార్పణ, అగ్ని మథనం, అఖండ దీపస్థాపన, పంచగవ్య సంస్కారం నిర్వహించారు. సాయంత్రం దర్బారుహాలులో లలితా వైభవంపై కవి సమ్మేళనం నిర్వహించారు. తిరుమల పెద్దింటి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో 20 మంది కవులు పాల్గొని లలితా అమ్మవారి విశిష్టత, వైభవంపై అద్భుతమైన కవిత్వం చెప్పి అలరించా రు. ముందుగా ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు రచించిన 'మన మహర్షులు' పుస్తకాన్ని పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, ఆచార్య బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. రాంభట్ల నృసింహశర్మ, శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్పొరేటర్ ఉషశ్రీకి అభినందన


కార్పొరేటర్ ఉషశ్రీ ని అభినందించిన కేకేరాజు

సీతమ్మధార : రాష్ట్ర మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024లో మహిళా విభాగంలో(+40) సింగిల్స్, డబుల్స్‌లలో 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ మూడు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆమెను వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు తన కార్యాలయంలో అభినందించారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలో అందుబాటులోకి అంగన్‌వాడీ కేంద్రం


పనులు పరిశీలిస్తున్న బర్కత్ అలీ, రమణకుమారి, శ్రీలత

మద్రిపాలెం : త్వరలోనే నూతన అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులోకి రానుందని 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం మద్రిపాలెం శివనగర్ దరి ఆంధ్రకేసరి నగర్‌లో నిర్మాణంలో ఉన్న అంగన్ వాడీ భవనాన్ని ఆయన ఐసీడీఎస్ సీడీపీవోలు రమణకుమారి, శ్రీలతతో కలిసి పరిశీలించారు. రూ.16లక్షల వ్యయంతో నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఈ భవనం త్వరలోనే ప్రారంభం కానుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో సొంత భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులోకి రానుండడంపై హర్షం వ్యక్తం చేశారు.

'జగనన్నకు చెబుదాం'కు 6 వినతులు

కంచరపాలెం : జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి 6 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ - 1, 2 టీఎస్ఎన్ రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, ఈఈ సూరిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' కార్యాలయంలో గ్రీవెన్స్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల నుంచి ఆయన పలు వినతులు స్వీకరించారు. పలు సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో అందుబాటులోకి డిజిటల్ ఓపీ

- ఆస్పత్రికి ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్ కేటాయింపు
- స్కాన్ చేస్తే ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కౌంటర్‌లో ఓపీ నంబర్


కంప్యూటర్‌లో ఓపీ వివరాల పత్రాలు డౌన్‌లోడు చేసి రోగులకు ఇస్తున్న సిబ్బంది



విమ్స్‌లో ఓపీ వద్ద క్యూ ఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేస్తున్న మహిళ

ఆరిలోవ: 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మెషిన్'లో భాగంగా ఆస్పత్రులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటలైజ్ చేస్తున్నాయి. ఈ మేరకు విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లోను అధికారులు కీలక మార్పులు చేస్తున్నారు. ముందుగా ఓపీ సేవలను డిజిటలైజ్ చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఓపీ చీటీ తీసుకునేందుకు కౌంటర్ల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేకుండా ఆస్పత్రి ప్రాంగణంలో పలుచోట్ల క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. అభా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే...ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అభా కౌంటర్‌లో క్షణాల్లో ఓపీ ఇస్తారు. దీనివల్ల రోగి గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం విమ్స్‌లో ఓపీ తీసుకోవాలంటే కనీసం అరగంట సమయం పడుతుంది. ఇకపై రోగులకు ఈ సమయం ఆదా కానుంది. ఈ సేవలను ఆస్పత్రికి వచ్చే రోగులు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. స్మార్ట్ ఫోన్ లేని రోగులు యథావిధిగానే ఓపీ కౌంటర్లలో ఓపీ సేవలు పొందవచ్చునన్నారు.

క్యూఆర్ కోడ్‌తో..

విమ్స్ ఓపీ విభాగం వద్ద గోడపై పెద్ద సైజులో క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్ అతికించారు.

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు అక్కడికి వెళ్లి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఏబీహెచ్‌ఏ) యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడు చేసుకోవాలి. అనంతరం గోడ మీద అతికించే క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవడం ద్వారా ఓపీ నమోదవుతుంది. అవసరమైన వివరాలతో ఓపీ పత్రం అందుతుంది. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి రోగి పేరు, ఆధార్ నంబరు, ఏ వ్యాధితో బాధపడుతున్నారో నమోదు చేయాలి. అనంతరం మొబైల్ మెసేజ్‌లో వచ్చే ఓపీ నంబరు చెబితే సిబ్బంది కంప్యూటర్ నుంచి రోగికి సంబంధించిన వివరాలతో కూడిన పత్రం డౌన్‌లోడు చేసి అందిస్తారు. ఆ పత్రం పట్టుకొని సంబంధిత వైద్యుడు ఉండే ఓపీ గదికి వెళ్లాలి. అక్కడ కూడా ఆ వైద్యుడు తన వద్ద ఉండే కంప్యూటర్‌లో రోగి వివరాలు నమోదు చేస్తారు. రోగి ఎప్పటి నుంచి ఆ వ్యాధితో బాధపడుతున్నాడు, దాని లక్షణాలు తదితర వాటిని నమోదు చేసుకొని దానికి అవసరమైన వైద్యం అందిస్తారు. మళ్లీ కొద్దిరోజులు తర్వాత ఎప్పుడు ఆ రోగి వెళ్లినా ఆధార్ నంబరు నమోదు చేయగానే అతని పూర్వపు వివరాలు అన్నీ తెలుస్తాయి. దీంతో రోగిని పరీక్షించడం వైద్యుడికి సులువవుతుంది. ఈ విధానంపై విమ్స్‌కు వెళ్తున్న రోగులు, వారి బంధువులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాప్ డౌన్‌లోడు చేయడం, క్యూఆర్ కోడ్


రోగి బంధువుకు డిజిటల్ ఓపీ నమోదుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

స్కాన్ చేయడం తెలియని వారికి ఆస్పత్రి సిబ్బంది సహాయం చేస్తున్నారు.

మొబైల్ లేనివారి కోసం పాత పద్ధతిలోనూ ఓపీ

మొబైల్ లేనివారు, చదువులేని వారి కోసం పాత పద్ధతిలో కూడా ప్రస్తుతం ఓపీ నమోదు చేస్తున్నారు. వారు గతంలో మాదిరిగా క్యూలో నిలబడి పేరు, వయసు, వ్యాధి పేరు చెబితే ఆయా వివరాలతో రాసి ఇచ్చిన ఓపీ పత్రం తీసుకొని సంబంధిత వైద్యుడు ఉండే గదికి వెళ్లాలి. అలాంటి వారికి అక్కడ పాత పద్ధతిలోనే వైద్య సేవలు అందిస్తున్నారు.

డిజిటల్ సేవల కోసం 40 కంప్యూటర్ల వినియోగం



పేపర్, పెన్ వాడకానికి స్వస్తి చెప్పి డిజిటల్ సేవలను విమ్స్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగా ఏబీహెచ్‌ఏ యాప్ ద్వారా ఓపీలో రోగుల వివరాలు నమోదు చేస్తున్నాం. దీనిపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానం ద్వారా వైద్యులు రోగికి సేవలు అందించడం సులువవుతుంది. రోగికి సంబంధించిన అనారోగ్య వివరాలను వైద్యుడు కూడా కంప్యూటర్‌లో నమోదు చేస్తుండడంతో రెండోసారి ఆ రోగి వచ్చినప్పుడు పూర్వాపరాలు మళ్లీ చెప్పక్కర్లేదు. తదుపరి వైద్యం అందించవచ్చు. విమ్స్‌లో డిజిటల్ వైద్య సేవల కోసం ప్రస్తుతం 40 కంప్యూటర్లు వినియోగిస్తున్నాం.

– డాక్టర్ రాంబాబు, డైరెక్టర్, విమ్స్

విద్యార్థులకు పద్యపఠన పోటీలు


బహుమతులు అందుకున్న విద్యార్థులు

మురళీనగర్ : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ పార్కులో విద్యార్థులకు పద్యపఠనం, చిత్రలేఖన పోటీలు సోమవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. వేమన పద్యాలు, సుమతీ శతకంలోని పద్యాలను విద్యార్థులు పఠించారు. ప్రకృతి సౌందర్యంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు, ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, కేబినెట్ సెక్రటరీ బి.సత్యనారాయణ, కోశాధికారి మురళి, ఎన్.బుచ్చయ్య, వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు న్యాయ నిర్ణేతులుగా వ్యవహరించారు. చిత్రలేఖనం పోటీల్లో వైనవి ప్రథమ, నిహాల్ సత్య ద్వితీయ, సహస్ర తృతీయ స్థానాల్లో నిలిచారు. పద్య పఠన పోటీల్లో ఇష్రిత ప్రథమ, దిలీప్ ద్వితీయ, రిషిక తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు మహానుభావుల చరిత్ర తెలుగు పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, పెన్నులు, మంచి ప్రతిభ చూపిన వారికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితా రెడ్డి, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, ఎం.శేషామణి, కోశాధికారి పి.కమల, ఎ.మాధవీలత, అనూష, సుమలత పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు


అపార్టుమెంట్లో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ద్వారకా క్రైం సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార : నేరాల నియంత్రణలో భాగంగా బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులోని నూతన గృహ సముదాయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సీసీఎస్ ఏసీపీ వెంకటరావు, ద్వారకా క్రైం సీఐ శ్రీనివాసరావు ఈ సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నూతన భవనానికి ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ఆరా

సీతమ్మధార : పెండింగ్ కేసులపై సీసీఎస్ ఏసీపీ వెంకటరావు ఈస్టు సబ్ డివిజన్ క్రైం పోలీసులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పాత కేసుల్లో ప్రమేయం వున్న కొంత మందిని విచారించారు. పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దొంగలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ఎస్‌ఐలు భాస్కరరావు, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.